# ప్రజాపాలన

## అమరావతి ఫ్లస్

మంగళవారం,
సెప్టెంబర్ 25-2018
పేజీలు:8

కృష్ణా, గుంటూరు , ప్రకాశం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,విశాఖ,విజయనగరం,శ్రీకాకుళం,నెల్లూరు,కర్నూలు,కడప,చిత్తూరు,అనంతపురం


### చంద్రబాబు అధికారంలోకి రాగానే అన్నీ

# 'గోవిందా..గోవింద'!



- సబ్సిడీలు, సంక్షేమ పథకాలు అన్నీ దూరమయ్యాయి
- అబద్ధాలు చెప్పే వాళ్లు నాయకులుగా కావాలా?
- కొత్త వలస బహిరంగ సభలో జగన్

విజయనగరం: చంద్రబాబు అధికారంలోకి రాగానే 'అన్నీ గోవిందా.. గోవిందా' అయ్యాయని వైసీపీ అధినేత జగన్ తీవ్ర విమర్శలు చేశారు. విజయనగరం జిల్లా కొత్తవలసలోకి జగన్ ప్రజాసంకల్పయాత్ర చేరుకుంది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు అధికారంలోకి రాగానే మద్య నిషేధం, రెండు రూపాయలకు కిలో బియ్యం, వ్యవసాయం, వర్షాలు, గిట్టుబాటు ధరలు, పేదలకు ఇళ్ల నిర్మాణం.. ఇలా అన్నీ ప్రజలకు దూరమయ్యాయని చెబుతూ.. 'గోవిందా' అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. చంద్రబాబు సీఎం కుర్చీలో కూర్చోగానే సబ్సిడీలు, సంక్షేమ పథకాలు ఎగిరిపోయాయని, నీతి ఎగిరిపోయిందని విమర్శించారు. అబద్ధాలు చెప్పే వాళ్ళు, మోసాలు చేసే వాళ్లు నాయకులుగా కావాలా? అని ప్రజలను ప్రశ్నించారు.

కష్టాల సుడిగుండంలో చిక్కుకుని విలవిల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు నేనున్నాంటూ భరోసా ఇవ్వడానికి ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించిన ప్రజాసంకల్పయాత్ర ప్రభంజనం సృష్టిస్తోంది. గతేడాది నవంబర్ 6న ఇడుపులపాయలో ప్రారంభమైన పాదయాత్ర నేడు 3000 కిలోమీటర్ల మైలురాయిని అధిగమించింది. చంద్రబాబు అవినీతిని ఎలుగెత్తి చాటుతూ.. పేదల ఉసురు పోసుకుంటున్న విధానాలను తూర్పారాబడుతూ సాగిస్తున్న యాత్రకు 11 జిల్లాల ప్రజలు బ్రహ్మరథం పట్టారు.

జననేత జనం కోసం చేపట్టిన ప్రజాసంకల్పయాత్రలో సోమవారం మరో చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. విజయనగరం జిల్లా, ఎస్‌కోట నియోజకవర్గం, కొత్తవలస మండలం దేశపాత్రునిపాలెం వద్ద 3000 కిలోమీటర్ల మైలురాయిని చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాసంకల్పయాత్ర 3000 కిలోమీటర్ల పైలాన్‌ను జననేత వైఎస్ జగన్ ఆవిష్కరించారు. అదేవిధంగా ఈ మైలురాయికి గుర్తుగా రావి మొక్కను అక్కడ నాటారు.

చారిత్రాక ఘట్టానికి సాక్షులుగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. దీంతో ఆ రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. జననేత పాదయాత్ర 3000 కిలోమీటర్లు చేరుకున్నవేళ తెలుగు రాష్ట్రాలతోపాటు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సంఘీభావ యాత్రలు కొనసాగాయి.

కిలోమీటర్ల వారిగా పాదయాత్ర ఘనతలు

0– వైఎస్ఆర్ జిల్లా, పులివెందుల నియోజకవర్గం ఇడుపుల పాయ
500– అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గం గొట్లూరు
1000– నెల్లూరు జిల్లా వెంకటగిరి నియోజకవర్గం సైదాపురం
1500– గుంటూరు జిల్లా పొన్నూరు నియోజకవర్గం ములుకుదురు
2000– పశ్చిమ గోదావరి జిల్లా మాదేపల్లి
2500– తూర్పు గోదావరి జిల్లా పసలపూడి శివారు
3000– విజయనగరం జిల్లా దేశపాత్రునిపాలెం

## వరవరరావు ఇంటిని ముట్టడించిన ఏబీవీపీ నేతలు



హైదరాబాద్: విప్లవ రచయిత సంఘం నేత వరవరరావు ఇంటిని ఏబీవీపీ నేతలు చుట్టుముట్టారు. అరకు ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే సివేరి సోమ హత్యకు నిరసనగా ఏబీవీపీ నేతలు ఆయన ఇంటిని చుట్టుముట్టినట్లు తెలుస్తోంది. అరకు ఘటనలో వరవరరావు పాత్ర ఉందంటూ నినాదాలు చేశారు. వరవరరావును వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. గతంలో విశాఖపట్నం ఏజెన్సీ ప్రాంతంలోని వీరవరం గ్రామస్తులు వరవరరావు ఇంటి ముందు ఆందోళన చేశారు. తమకు మావోల నుంచి ముప్పు ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా

4లో

## మర్రి రాజశేఖర్ ఆధ్వర్యంలో భారీ కేక్ కటింగ్



చిలకలూరిపేట: (ప్రజా పాలన) సెప్టెంబర్ 24. వైసిపి రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర మూడు వేల కిలోమీటర్లు పూర్తిచేసుకున్న సందర్భంగా మర్రి రాజశేఖర్ నివాస గృహం వద్ద సోమవారం వైసీపీ శ్రేణులు ఏర్పాటుచేసిన భారీ కేక్ ను కట్ చేసి పార్టీ శ్రేణులకు రాజశేఖర్ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసమస్యలు, ప్రత్యేక హెూదా సాధయే లక్ష్యంగా చేసుకొని జగన్మోహన్ రెడ్డి చేస్తున్నా పాదయాత్రకు ప్రజల్లో మంచి స్పందన రావడమే కాకుండా రాష్ట్రమంతా యాత్రపై చర్చించుకోవడం విశేషమన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్ చేస్తున్న పాదయాత్ర పార్టీ గెలుపుకు నాంది అవుతుందన్నారు. పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరగాలి అంటే తప్పనిసరిగా జగన్ ముఖ్యమంత్రి అవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ నాయకులు కార్యకర్తలు సైనికుల్లా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎ.వియం సుభాని, గేరా లింకన్, సాతులూరి కోటి, తో పాటు కౌన్సిలర్లు ఆయా మండలలా నాయకులు పాల్గొన్నారు

# ఇక్కడ చీరకొంగే ముడుపు!

**సృష్టికి మూలం శక్తి. ఆ శక్తిని ఎవరు ఆరాధించినా స్త్రీ మూర్తిగానే కొలుస్తారు. జగదాంబగా పేరుపొందిన ఆదిపరాశక్తి వివిధ నామాలతో పూజలందుకుంటోంది. వాటిలో చాముండి, చాముండేశ్వరి, చౌడేశ్వరి పేర్లు ప్రసిద్ధి చెందినవి. పార్వతీదేవి చౌడేశ్వరిగా పూజలందుకుంటున్న క్షేత్రం నందవరం. ఈ క్షేత్రంలో కొలువుదీరిన చౌడేశ్వరి మాత దర్శనం ఐశ్వర్య కారకంగా భావిస్తారు భక్తులు. మనసులోని పిరికితనాన్ని పోగొట్టి ధైర్యసాహసాలిచ్చే వీర చౌడేశ్వరీదేవిగా ఇక్కడ విశాలాక్షిని ఆరాధిస్తారు. తనను కొలిచే భక్తుల కోసం కదిలి వచ్చిన అమ్మవారు ఇక్కడ సువర్ణ మూర్తిగా స్వయంభువుగా వెలిసిందని స్థలపురాణం తెలియజేస్తోంది. ఆ ఆలయమే కర్నూలు జిల్లాలోని నందవరంలో ఉన్న చౌడేశ్వరీ క్షేత్రం. సాక్షాత్తూ ఆ అమ్మలగన్న అమ్మే ఇక్కడ చౌడేశ్వరిగా భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోంది.**



ఇదీ కథ

పూర్వం చంద్రవంశానికి చెందిన నంద భూపాలుడు ఈ ప్రాంతాన్ని పరిపాలిస్తూ ఉండేవాడు. ఆయన పాలనలో ప్రజలు సుఖ సంతోషాలతో జీవించేవాళ్లు. నంద భూపాలుడు దత్తాత్రేయుడి ఉపాసకుడు. ఆయన భక్తికి మెచ్చిన దత్తాత్రేయుడు రోజూ కాశీ వెళ్లి గంగా స్నానం చేయాలనే రాజు కోర్కెను మన్నించి పావుకోళ్లను ప్రసాదిస్తాడు. అయితే ఆ విషయం ఎవరికీ చెప్పకుండా వాటిని ధరించి మనోవేగంతో కాశీచేరి గంగా స్నానం చేసి విశ్వనాథుడినీ, విశాలాక్షినీ దర్శించుకుని తిరిగి తెల్లవారేసరికి తన రాజ్యం చేరుకునేవాడు. ఇలా కొంతకాలం గడిచాక, నంద భూపాలుడి భార్య శశిరేఖ తన భర్త రోజూ వేకువనే ఎక్కడికో వెళ్లి వస్తుండటం గమనించి భర్తను అడుగుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో శశిరేఖకు విషయం చెబుతాడు రాజు. ఆవిడ తనని కూడా కాశీ తీసుకువెళ్లమని కోరుతుంది. రాణి మాటను కాదనలేని నందభూపాలుడు ఆమెతో కలిసి కాశీ చేరుకుంటాడు. తిరిగి వచ్చే సమయానికి పావుకోళ్లు పనిచేయవు. తన రాజ్యానికి సత్వరం చేరుకోకపోతే రాజ్యం అల్లకల్లోలమవుతుందనే భయంతో సమీపంలోని ఆలయం దగ్గరున్న బ్రాహ్మణుల దగ్గరకు వెళ్లి జరిగింది చెప్పి సాయమడుగుతాడు. వాళ్లు తమ తపోశక్తితో రాజుకు తిరిగి వెళ్లే మార్గాన్ని చూపిస్తారు. ప్రత్యుపకారంగా వారికే సహాయం కావల్సి వచ్చినా తప్పక చేస్తాననీ, నిస్సంకోచంగా ఏదైనా అడగవచ్చనీ చెబుతాడు. అందుకు ఆ బ్రాహ్మణులు అవసరమైనప్పుడు అడుగుతామని అంటారు. కొంతకాలం తర్వాత కాశీ చుట్టుపక్కల ప్రాంతాల్లో కరవు రాగా, నందభూపాలుడిని సహాయం అడిగేందుకు కొందరు బ్రాహ్మణులు నందవరం బయలుదేరుతారు. రాజ్యానికి చేరుకున్న వారు రాజుకి తామెందుకు వచ్చారో తెలియజేస్తారు. అప్పుడు రాజు తానిచ్చిన వాగ్దానానికి రుజువేంటని అడుగుతాడు. అందుకా బ్రాహ్మణులు విశాలాక్షి అమ్మవారే అందుకు సాక్ష్యమనీ, ఆమెచేతే ఆ విషయాన్ని రుజువు చేస్తామనీ చెబుతారు. బ్రాహ్మణులు కాశీ చేరుకుని విశాలాక్షిని నందవరం రమ్మని వేడగా 'నేను మీతో వస్తాను కానీ ఒక్క షరతు. గమ్యం చేరేవరకూ ఎవ్వరూ వెనక్కి తిరిగి చూడకూడదు' అని చెబుతుంది. అలా కొంత దూరం వెళ్లేసరికి వెనక నుంచి ఎలాంటి అలికిడీ వినిపించకపోవడంతో అనుమానం వచ్చిన ఒక బ్రాహ్మణుడు వెనక్కి తిరుగుతాడు. దీంతో అమ్మవారు అక్కడే శిలా రూపంలోకి మారిపోతుంది. విషయం తెలుసుకున్న రాజు అక్కడికి చేరుకుని, అమ్మవారికి ఆలయాన్ని నిర్మించాడనే కథ ప్రచారంలో ఉంది.

వరాలిచ్చే కలిచెట్టు

అమ్మవారి ఆలయ పరిధిలోని కలిచెట్టుకు విశేష ప్రాముఖ్యం ఉంది. సంతానం ప్రసాదించే చెట్టుగా ఈ చెట్టును పూజిస్తారు భక్తులు. సంతానం లేనివారు చీర కొంగును చించి చెట్టుకొమ్మకు కడితే సంతానం కలుగుతుందని వీరి విశ్వాసం. చౌడేశ్వరి అమ్మవారు కాశీ నుంచి నందవరం వచ్చినప్పుడు ఈ చెట్టు విశాలాక్షి చీర కొంగుకు తగులుకుని వచ్చిందని చెబుతారు. చౌడేశ్వరిని అర్చించిన తర్వాత ఈ వృక్షాన్ని కూడా తప్పక అర్చించడం అనేది పూర్వం నుంచీ వస్తున్న ఆనవాయితీ. ఆలయంలో నిత్యం అన్నదానం జరుగుతుంది. ఇక్కడ దత్తుడు ఇచ్చిన పాదుకలు ఇప్పటికీ దర్శనమిస్తాయి. రోజూ చౌడేశ్వరీదేవికి కుంకుమార్చనలు జరుగుతాయి. ఆషాఢ బహుళ అమావాస్య రోజున అమ్మవారి జన్మదిన వేడుకలను వైభవోపేతంగా నిర్వహిస్తారు. దసరా నవరాత్రి ఉత్సవాలతోపాటు ఉగాది వేడుకలను కూడా ఇక్కడ పెద్ద ఎత్తున జరుపుతారు.

ఇలా చేరుకోవచ్చు...

కర్నూలు పట్టణానికి సుమారు డెబ్భై రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చౌడేశ్వరి ఆలయాన్ని చేరుకోవడానికి రైలు, రోడ్డు మార్గాలు అందుబాటులో ఉన్నాయి. బనగానపల్లి, నంద్యాల వెళ్లే బస్సులో ప్రయాణించి అమ్మవారిని దర్శించుకోవచ్చు. రైలు మార్గంలో అయితే బనగానపల్లి, నంద్యాల, పాణ్యం రైల్వే స్టేషన్లలో దిగి, అక్కడి నుంచి రోడ్డుమార్గంలో క్షేత్రానికి వెళ్లొచ్చు.

## సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు



నూజెండ్ల : పెట్టుబడిలేని ప్రకృతి వ్యవసాయంతో కూడా మంచి దిగుబడులు సాధించవచ్చునని సేంద్రియ వ్యవసాయ డివిజనల్ ఇన్స్‌పెక్టర్ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. నూజెండ్ల మండలంలోని అప్పాపురం గ్రామంలో సేంద్రియ వ్యవసాయం పై విద్యార్ధులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు సేంద్రియ వ్యవసాయం పై అవగాహన కల్పించారు. విత్తనశుద్ధి, సాగులో మెళుకువలు, కలుపునివారణ, తెగుళ్ళకు వాడాల్సిన మందులు తయారు చేసుకోవడం వటి విషయాలు రైతులకు వివరించారు. అనంతరం గ్రామంలో విద్యార్ధులతో కలిసి సేంద్రియ వ్యవసాయం పై అవగాహనా ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 7 అర్జీలు

రేపల్లె ప్రజాపాలన: స్థానిక మండల తహశీల్దారు గారి కార్యాలయములో జరిగిన ప్రజావాణికి 7 అర్జీలు వచ్చాయని తహశీల్దారు రమణకుమారి తెలిపారు. ఇందులో రేపల్లె టౌన్ నుండి క్రొత్తగా రేషన్‌కార్డుల కొరకు 2 తుమ్మల నుండి 1 చాట్రగడ్డ నుండి 1 ఉప్పూడి నుండి 1 మరియు తమ భూములను సర్వే చేయించాలని, పట్టాదారుపాసుపుస్తకములో తమ పేర్లు తప్పుగా నమోదు అయ్యాయని వాటిని సరిచేసి ఇవ్వాలని, 1బి అడంగల్‌లో తమ పేర్లు నమోదు చేయాలని నల్లూరుపాలెం నుండి సబ్బినేని శోభ అర్జీ అందజేశారని తహశీల్దారు తెలిపారు. ఈ సమావేశంలో యం.పి.డి.వో. శోభారాణి, యం.ఇ.ఓ. నవీన్‌కుమార్, ఎ.యస్.డబ్ల్యూ, ఓ. అన్నపూర్ణ, మున్సిపల్ ఆర్.ఐ. శ్రీలక్ష్మి వివిధ ప్రభుత్వశాఖల అధికారులు గ్రీవెన్స్‌లో పాల్గొన్నారు.

## దారుణం..దుర్మార్గం: యంయల్ఏ అనగాని

రేపల్లె ప్రజాపాలన: గిరిజనుల అభివృద్ధికి సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తూ వారి అభివృద్ధికి ఎంతో శ్రమిస్తున్న విశాఖజిల్లా అరకు యం.యల్.ఎ. కిడారి సర్వేశ్వరరావు, మాజీ యం.యల్.ఎ. సోమ లపై మావోయిస్టులు హత్యచేయడం దారుణమని దీనిని ఖండిస్తున్నామని యం.యల్.ఎ. అనగాని సత్యప్రసాద్ అన్నారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని యం.యల్.ఎ. తెలిపారు.

## ఏపిసిసి శక్తి ప్రారంభం

మీడియా మిత్రులకు ఆహ్వానం-25-9-2018 ఉదయం 11.00 గంటలకు శ్రీరామ ప్యాలెస్ పంక్షన్ హాల్ నందు(ఐలపురం వెనక) ఏపిసిసి శక్తి ప్రారంభం ఏ11.30 నిమిషాలకు ఏపిసిసి ఎస్సీ, ఎస్టీ విభాగాల ముఖ్య నాయకులు సమ్మేళనం. ఈ కార్యక్రమంలో ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ఉమెన్‌చాందీ, ఏపిసిసి అధ్యక్షులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి, ఏఐసిసి నాయకులు కొప్పుల రాజు తదితరులు పాల్గొంటారు : ఎస్.ఎన్.రాజా, ప్రధాన కార్యదర్శి (అడ్మిన్), ఏపీసిసి.

## అవాంతరాలు అధిగమించి విగ్రహాన్నినిర్మిస్తాం ... శేషు మాధవి

గన్నవరం ప్రజాపలన: ఉంగుటూరు మండలం వెల్లపాడు గ్రామంలో నిర్మించతలపెట్టిన బాబూజగజ్జీవనరాం, అంబేద్కర్ విగ్రహ నిర్మాణాన్ని అడ్డుకునేందుకు కొందరు కుట్రపన్నుతున్న నేపథ్యంలో విగ్రహ నిర్మాణకమిటి సమావేశమయ్యింది. విగ్రహనిర్మాణకమిటి కన్వీనర్ కానూరి శేషుమాధవి ఆధ్వర్యంలో ఈ నిర్మాణానికి మద్దతు పలుకుతూ స్వఛ్చందంగా గ్రామస్తులు సమావేశంలో పాల్గొన్నారు. విగ్రహనిర్మాణ కమిటి కన్వీనర్ కానూరిశేషుమాధవి సమావేశంలో మాట్లాడుతూ విగ్రహనిర్మాణానికి ప్రతిపాదించిన కారణంగా కొంతమంది నేను నిర్వహిస్తున్న వృధ్ధాశ్రమం గ్రామంలో నిర్వహించరాదని అభ్యంతరం చెపుతు గ్రామంలో అలజడి రేపుతున్నారన్నారు.

